## క్లుప్తంగా

### విద్యుత్ శాఖ ఇంజనీర్ కార్యాలయం మార్పు

**మంగళగిరి:** పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని విద్యుత్ శాఖ ఇంజనీరు కార్యాలయాన్ని మార్పు చేసినట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్‌లోని టిడ్కో గృహాల వద్ద నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలోకి మార్చినట్లు వివరించారు. మార్పును పట్టణంలోని 27,28,29,30,31,32 వార్డులతో పాటు నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, నీరుకొండ గ్రామాల వినియోగదారులు గమనించాలని కోరారు.

### మూలాంకురేశ్వరికి విశేష పూజలు



**ఫిరంగిపురం:** మండలంలోని అమీనాబాద్‌లోని కొండపై కొలువైన మూలాంకురేశ్వరి అమ్మకు కార్తికమాస శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు అయ్యన్నశాస్త్రి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, అష్టోత్తర, సహస్ర నామాలతో కుంకుమ పూజలు, ఖడ్గమాల పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలో మూర్తులకు, శ్రీచక్రానికి కుంకుమార్చనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### పథకాలపై అవగాహన అవసరం

**ఫిరంగిపురం:** ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన అవసరమని పలువురు అధికారులు చెప్పారు. మండలంలోని రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో శుక్రవారం వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలగురించి , ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు పథకాలు అందిస్తున్న తీరును వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విలియమ్స్, ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీ కుమారి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, సర్పంచులు అంజనీదేవి, డి.మెల్కియా, కార్యదర్శులు గజేంద్ర, కోటేశ్వరరావునాయక్ పాల్గొన్నారు.

### నేడు కంతేరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

**తాడికొండ:** విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మండలం కంతేరు గ్రామంలో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఓటరు నమోదుపై అవగాహన



**మంగళగిరి:** నగరంలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కళాశాల స్వీప్ సూపర్‌వైజర్ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఓటు అనేది ప్రతి పౌరుడు హక్కు అని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మలజ్యోతి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ నిహారిక, అమూల్య, హేమలత, రితేష్, దివ్యశ్రీ, కుమార్ పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం స్వాధీనం

**మంగళగిరి:** నగర పరిధిలోని పెదవడ్లపూడి వద్ద ఆటోలో నిబంధనలకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు. గురువారం రాత్రి విజయవాడ నుంచి రేపల్లె ఆటోలో తరలిస్తుండగా ఆటోను తనిఖీలు చేసిన పోలీసులు అందులోని రేషన్ బియ్యం అని తెలుసుకుని బియ్యం ఆటోని స్టేషన్‌కు తరలించారు. ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. శుక్రవారం యర్రబాలేనికి చెందిన మహిళ రేషన్ బియ్యాన్ని కిలో రూ.10 కొనుగోలు చేస్తుండగా మండల విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాయుడు నాగరాజు, అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు స్పందించకపోవడంతో ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు విలేకరులకు తెలిపారు.

### వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు

**మంగళగిరి:** నగరంలోని వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ నిర్మల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 18 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# పేదలకు సంక్షేమం ఘనత జగనన్నదే

- వైఎస్సార్ సీపీ నాయకుడు గంజి చిరంజీవి
- పెదవడ్లపూడి, మంగళగిరిలో వై ఏపీ నీడ్స్ జగన్



నగరంలోని లక్ష్మీనృసింహస్వామి కాలనీలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**మంగళగిరి:** నవరత్నాలతో సంక్షేమ బాట కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి తెలిపారు. నగర పరిధిలో పెదవడ్లపూడి ఒకటో సచివాలయం, పట్టణంలోని 13వ సచివాలయం శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటి వద్దకే ఒకటో తేదీ తెల్లవారుజామునే పెన్షన్ వస్తుందంటే అది పేదలకు, దివ్యాంగులకు, లబ్ధిదారులపై సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమని పేర్కొన్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో పెన్షన్ తీసుకోవాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడంతో పాటు కొందరు పెన్షన్‌లో సగం లంచం తీసుకునేవారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పథకాల గురించి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వివరించి ఇంటికే తెచ్చి ఇస్తున్నారని ఇలాగ ఎలాంటి ఇబ్బంది లేకుండా పథకాలు ఇంటి వద్దకే వస్తుండగా మరెవరో ఎందుకని ప్రశ్నించారు. నవరత్నాలతో మాలాంటి పేదల జీవితాలని మారుస్తున్న సీఎం వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, పట్టణ, రూరల్ జేసీఎస్ కన్వీనర్లు ఎండీ ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, నాయకులు అగస్టీన్, థామస్, ఈఓపీఆర్డీ శ్రీనివాస్‌రెడ్డి, సాలి ప్రశాంత్, కె.రాజేష్, ఎ.రామకృష్ణారెడ్డి, సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

**సంక్షేమం కొనసాగాలంటే జగనే కావాలి**

**తాడేపల్లిరూరల్:** అంబేడ్కర్ ఆశయాలు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి 13వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత 13వ సచివాలయం వద్ద ఒకటో వార్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేరీ మాత విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం 13వ సచివాలయంలో ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు అధ్యక్షతన దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుపాలస్వామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. విద్య, వైద్యాన్ని అందరికి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ఏర్పాటు చేసి పేద పిల్లలు కూడా దేశ విదేశాలకు వెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని ఆయన అన్నారు. 13వ సచివాలయ పరిధిలో 19 కోట్ల, 19 లక్షల 13 వేల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించారని అన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలంటూ ఇంటింటికి తిరిగి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈ.విడ్‌రాజు, సచివాలయ కన్వీనర్లు టి.వికాస్, ఎస్.సుధ, బూత్ కన్వీనర్ జి.లక్ష్మి, జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ దుర్గారావు, వివిధ విభాగాల కన్వీనర్లు ఎం.ప్రకాష్, బి.దేవసుందరం, బి.దాసు, సీనియర్ నాయకులు కె.ఉదయ రాజు, ఎస్.గోపి, స్థానిక నాయకులు జి.గోపి, ఈ.శేఖర్, కె.మహమ్మద్, జె. కోటయ్య, ఎం.సతీష్, కె.శివ, కె.మనోజ్, బి.నాగరాజు, హుస్సేనమ్మ, శ్యామల, హసీనా పాల్గొన్నారు.

### ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ

**మేడికొండూరు:** యువత భవితకు బంగారు బాట వేయడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మేడికొండూరులో శుక్రవారం స్పోర్ట్స్ కిట్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ గల యువతను గుర్తించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని నిర్ణయించి ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన వారు వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధితో పాటు, క్రీడలను ప్రోత్సహిస్తున్నారని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, ఎంపీడీఓ ప్రభాకరరావు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీచేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

## ఘనంగా విజ్ఞాన్ స్కూలు వార్షికోత్సవం



వార్షికోత్సవానికి నృత్యంతో స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు



అగ్నికీలలో విద్యార్థుల సాహస కృత్యాలు

**మంగళగిరి:** నగర పరిధిలోని నూతక్కిలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూలు వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ పోలీస్ కమిషనర్ టీకే రాణా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు క్రీడలు, సాహస క్రీడలలో పాల్గొని సమాజసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాహస కృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ కళాశాల సీఈఓ ఎం రాంబాబు, జీవీఎస్ ప్రాడక్టు డైరెక్టర్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రాంత ప్రచారక్ సిహెచ్ విజయాదిత్య, కేవీ రెడ్డి కళాశాల ప్రొఫెసర్ ఎల్.రఘుకుమార్, పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.రామిరెడ్డి, వైస్ చైర్మన్ వి.రామకృష్ణ, కార్యదర్శి వేణుగోపాలనాయుడు, ట్రెజరర్ సిహెచ్.ఆదిశేషావతారం, ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలి

**ఐనవోలు(తాడికొండ):** రక్తదానం ఎంతో అవసరమని, విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం అలవర్చుకోవడం శుభపరిణామమని గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. వీఐటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఐనవోలు వీఐటీ ఏపీ రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఉప కులపతి డాక్టర్ ఎస్వీ కోటారెడ్డితో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో వీఐటీ ఏపీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థి సంక్షేమ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, గుంటూరు జీజీహెచ్ వైద్యాధికారి డాక్టర్ కె.సురేష్ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆపరేషన్స్ డెప్యూటీ వైస్ ప్రెసిడెంట్ ఇంద్రగంటి సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్ కుమార్

## బీఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

**మేడికొండూరు:** బీఎల్‌ఓలు ప్రజలకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్, తాడికొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి రవీంద్రరావు అన్నారు. మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ రెవెన్యూ అధికారులు బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహసీల్దారు శ్రీనివాస శర్మ అధ్యక్షత వహించారు. రవీంద్రరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. కొత్తగా పొందే ఓటు హక్కు రేపటితో గడువు పూర్తవుతోందని, నిర్ణీత గడువులోగా కొత్తగా ఓటు హక్కు పొందేందుకు నమోదయ్యే అభ్యర్థుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకుని ఆన్‌లైన్ చేయాలని కోరారు. మండలంలో అనివార్య కారణాలతో మృతి చెందిన వ్యక్తుల ఓట్లు తీసివేయాలని ఆదేశించారు. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరికి ఇంటి నంబరు సరిగా ఉందో లేదో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, సంబంధిత అధికారులను ఆయన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు ఓటు హక్కు చాలా విలువైందన్నారు. అధికారులు ఓటు హక్కు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించమని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక అధికారి రవీంద్రరావు

## వ్యక్తిపై కత్తితో రౌడీషీటర్ దాడి

- ఆరు రోజుల వ్యవధిలో రెండోసారి
- పోలీసుల కనుగప్పి తిరుగుతున్న వైనం

**తాడేపల్లిరూరల్:** విజయవాడ పటమటకు చెందిన రౌడీషీటర్ కిరణ్ ఓ యువకుడిపై శుక్రవారం దాడిచేసి కత్తితో పొడిచాడు. పోలీసులు కథనం.. తాడేపల్లి బైపాస్‌రోడ్ మదర్‌థెరిస్సా కాలనీలో వనపర్తి బుజ్జిపై రౌడీ షీటర్ కిరణ్ తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట అందరూ చూస్తుండగా బ్లేడ్ వంటి ఆయుధంతో గాయపరిచి పరారయ్యాడు. బుజ్జికి బావ వరుస అయిన విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన ఆటోడ్రైవర్ బాలసాని తిరుపతిరావు పోలీసులకు సహకరిస్తున్నాడని అనుమానం వచ్చింది. శుక్రవారం తన ప్రియురాలైన బుజ్జితో కలసి ఆటోడ్రైవర్ తిరుపతిరావు, విజయవాడ నుంచి బుజ్జి నివాసముంటున్న మదర్ థెరిస్సా కాలనీకి వచ్చారు. బుజ్జి ఇంట్లోకి వెళుతుండగా ఆటోలో కూర్చున్న బుజ్జి బావ తిరుపతిరావుతో కిరణ్ నా ప్రియురాలితో ఏం పనిరా అంటూ, పోలీసులకు నాగురించి చెబుతున్నావా అంటూ దాడికి పాల్పడ్డాడు. తిరుపతిరావు భయంతో ఇంట్లోకి పరిగెడుతున్నా కత్తితో వీపుపై, పొట్టపై దాడిచేసి కిరణ్ పరారయ్యాడు. గాయపడిన తిరుపతిరావును స్థానికులు విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆటోడ్రైవర్ తిరుపతిరావు ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉన్నట్లు బంధువులు తెలిపారు. విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న కిరణ్ గతంలో పటమటలో తనతో చదువుకున్న మహిళతో పాటు కొంతమందిపై ఇదే విధంగా దాడి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కిరణ్ ప్రియురాలు అయిన బుజ్జికి 12 సంవత్సరాల బాలిక ఉంది. ఆ బాలికను అమ్మేసే ప్రయత్నం చేయడంతో బుజ్జికి, కిరణ్‌కు మధ్య వివాదం ఏర్పడడం, బుజ్జిని చంపి ఆ చిన్నారిని తీసుకువెళ్లి అమ్మేయాలని ప్రయత్నం చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆటోడ్రైవర్ బాలసాని తిరుపతిరావుపై జరిగిన దాడిపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టారు.

### వైభవంగా లక్ష బిల్వార్చన



**తాడేపల్లిరూరల్:** నగర పరిధిలోని సీతానగరం పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శంకరమంచి సాయి మాట్లాడుతూ కార్తికమాస బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి సోమేశ్వరునికి విశేష ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష మారేడు దళాలతో అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సాయంత్రం జరిగి కార్తిక దీపోత్సవంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి, భక్తిశ్రద్ధలతో పరమేశ్వరుని దర్శించుకున్నారని చెప్పారు.

### పోలీస్ కుటుంబాలకు చెక్కులు అందజేత



**నగరంపాలెం:** ఇటీవల ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ (హెచ్‌సీ) మాధవస్వామి, ఫిరంగిపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ల (పీఎస్) కానిస్టేబుళ్లు ఎస్.రాజేష్, కిషోర్‌లు అనారోగ్య కారణాలతో వేర్వేరుగా మృతిచెందారు. డిపార్ట్‌మెంట్ పరంగా మంజూరైన ఒక్కొక్క లక్ష రూపాయాల చెక్కులను మాధవస్వామి కుమారుడు సదానందం, రాజేష్ భార్య జ్యోతి, కిషోర్ భార్య సుధారాణిలకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యరాజు, ఉపాధ్యక్షుడు ఆర్ఐ రాజారావు, కరిముల్లా, హుస్సేన్ పాల్గొన్నారు.

## లక్ష్యసాధనతోనే ఉన్నత శిఖరాలు

- ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా ఏఎన్‌యూ
- వర్సిటీలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పన
- పోటీ పరీక్షలకు ప్రత్యేక కార్యచరణ
- వీసీ ఆచార్య పి.రాజశేఖర్



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

**ఏఎన్‌యూ:** నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని వీసీ ఆచార్య పి రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల పీజీ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం, ర్యాగింగ్ వ్యతిరేక అంశాలపై అవగాహన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ ర్యాగింగ్ రహిత యూనివర్సిటీగా ఏఎన్‌యూ ప్రత్యేకతను సొంతం చేసుకుందన్నారు. విద్యార్థులకు యూనివర్సిటీలో పూర్తి స్వేచ్ఛ ఉందని, దానిని దుర్వినియోగం చేసుకోకుండా నడచుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. సీనియర్లు, జూనియర్లు అనే బేధం, తారతమ్యాలు చూపకుండా అందరూ స్నేహభావంతో మెలగాలన్నారు. యూనివర్సిటీలోని ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి గదులు, వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామన్నారు. కోర్సులకు సంబంధించిన బోధనతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ, ప్రతి వసతి గృహంలో ఏసీ రీడింగ్ రూమ్ మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. లక్షకు పైగా పుస్తకాలతో ఉన్న లైబ్రరీ విద్యార్థులకు అందుబాటులో ఉందని వారికి కావలసిన విజ్ఞానాన్ని లైబ్రరీలో పొందవచ్చన్నారు. సమాజంలో, వ్యక్తిగత జీవితంలో అన్ని మార్పులకు విద్య కారణమనే వాస్తవాన్ని విద్యార్థులు గుర్తించాలన్నారు. విశ్వవిద్యాలయం త్వరలో నాక్ రి అక్రిడేషన్ కు వెళ్లనుందని అందులో ఏ డబల్ ప్లస్ అత్యున్నత స్థాయి ర్యాంకును సాధించే ప్రక్రియలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ వర్సిటీలో అకడమిక్ క్యాలెండర్‌ను అమలు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిపూర్ణ పౌరులను తీర్చిదిద్దేందుకు యూనివర్సిటీ ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ యూనివర్సిటీలో అందరికీ సమాన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య గంగాధరరావు, వార్డెన్లు ఆచార్య నాగరాజు, ఆచార్య వెంకట రత్నమ్మ ప్రసంగించారు.

### వైకుంఠపురంలో.. సకల సౌకర్యాలు

**తెనాలి:** చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తెనాలిలోని వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవస్థానం పవిత్రతను కాపాడుతూ భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. వైకుంఠపురం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కేశ ఖండనశాల, పొంగలి షెడ్డుకు శుక్రవారం ఎమ్మెల్యే శివకుమార్ శంకుస్థాపన చేశారు. దేవస్థానంలో పొంగలి షెడ్డు, కేశ ఖండనశాలకు 1984లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే శివకుమార్ తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ శంకుస్థాపన చేసి, 1987లో ప్రారంభోత్సవం చేశారు. అవి ప్రస్తుతం పాడుబడటంతో వాటి స్థానంలో నూతన నిర్మాణాలకు కుంభం సాయిబాబు అధ్యక్షుడిగా ఉన్న నూతన పాలకవర్గం శ్రీకారం చుట్టింది. రూ.35 లక్షలతో నిర్మిస్తున్న కేశ ఖండనశాల, పొంగలి షెడ్డు నిర్మాణాలకు పాలకవర్గంతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు కుంభం సాయిబాబు, ఆలయ సహయ కమిషనర్/ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు, పాలకవర్గ సభ్యులు బొద్దులూరి లక్ష్మీసరస్వతి, దేవరకొండ వెంకటరమణ, కురగంటి సునీత, బట్టు దుర్గారావు గురుస్వామి, ముంత దుర్గా ప్రసాద్, కనికిచర్ల చరణ్ రత్నసందీప్, వి. జగదీశ్వరి, ఎంపీపీ చెన్నకేశవులు పాల్గొన్నారు.

## రూ.40 లక్షలు ఖరీదు చేసే 150 మొబైల్‌ఫోన్లు అప్పగింత

**బాధితుల్లో ఆనందం**

**నగరంపాలెం:** సెల్‌ఫోన్ పోగొట్టుకుని ఫిర్యాదు చేసే ప్రతి ఒక్కరికీ తిరిగి వారి ఫోన్లను అప్పగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సుమారు రూ.40 లక్షలు ఖరీదైన 150 మొబైల్ ఫోన్లను శుక్రవారం బాధిత ఫిర్యాది దారులకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో అప్పగించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారి సౌకర్యార్థం ఈ ఏడాది మొదట్లో పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831574ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఎటువంటి ఎఫ్ఐఆర్‌లు లేకుండానే పెద్దఎత్తున మొబైల్‌ఫోన్లను వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి, బాధితులకు అప్పగిస్తున్నామని చెప్పారు. పలుమార్లు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు వెళ్లి కూడా ఫోన్లను రికవరీ చేసి అప్పగించామని అన్నారు. ఇటీవల మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న ఫోన్లను తీసుకొచ్చి అందజేశామని తెలిపారు. ఈ వాట్సాప్ నంబర్‌ను గుంటూరు జిల్లాతోపాటు ఇతరత్రా జిల్లాల ప్రజలు పోలీస్ మొబైల్ వాట్సాప్ నంబర్, సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న వెంటనే పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సెల్‌ఫోన్లల్లోని సమాచారం దుర్వినియోగం కాదని, తద్వారా సెల్‌ఫోన్లు బ్లాక్ అవుతాయని అన్నారు. అదే విధంగా పోగొట్టుకున్న ఫోన్లను త్వరితగతిన రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. పలువురు ఫోన్లను తీసుకున్న బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం టీఏ డబ్ల్యూ (టెక్నికల్ అనాలిసిస్ వింగ్), ఐటీ కోర్ బృంద సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాల సుబ్రమణ్యం, ఆర్ఐ రాజారావు, ఐటీ కోర్ ఎస్ఐ శ్రీనాథ్, ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి పాల్గొన్నారు.



## ఏఎన్‌యూలో ఫొటోగ్రఫీ విభాగం

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు నూతన విభాగాన్ని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఫొటోగ్రఫీ పితామహునిగా పేరొందిన ప్యారిస్‌కు చెందిన డాగ్‌రే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీలో ఉన్న ఆధునిక టెక్నాలజీలు, ఫొటోగ్రఫీ ప్రారంభం నుంచి నేటి వరకు వచ్చిన మార్పులు తదితర అంశాలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వీసీ తిలకించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ కోర్సు ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే విశేషమైన స్పందన లభించిందన్నారు. ఈ కోర్సులో ఇప్పటికే 30 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందడం అభినందనీయమన్నారు.. ఏడాది నిడివి గల ఈ కోర్సు చేసిన వారికి భవిష్యత్ ఉంటుందన్నారు. ఫొటోగ్రఫీ అనేది అభిరుచి గల కోర్సు అని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ అనిత, డాక్టర్ జె మధుబాబు పాల్గొన్నారు.